క్లుప్తంగా

బెలుం గుహల ఆవరణలో చెత్త తొలగింపు



గుహల ఆవరణలో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల: ప్రముఖ పర్యాటక కేంద్రం బెలుం గుహల ఆవరణలో శనివారం గుహల మేనేజర్ అమర్నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది స్వర్ణ ఆంధ్రా–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రం చేశారు. డార్మెంటరీతో పాటు పలు ప్రాంతాల్లో చెత్తను తొలగించి పరిశుభ్రం చేశారు. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేనేజర్ తెలిపారు. సిబ్బంది నిజామొద్దీన్, వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గిరి, సుధాకర్‌రెడ్డి, వెంకటేష్, శ్రీను, నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



పేరుసోముల పాఠశాలలో ఆర్వో నీటిని తాగుతున్న విద్యార్థినులు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రోమోర్ కోరమాండల్ సంస్థ రూ.3.5 లక్షల విలువైన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. శనివారం కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు ప్రారంభించారు. విద్యార్థులకు మంచి నీరు అందించాలనే ఉద్దేశంతో పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు కంపెనీ జోనల్ ఇన్‌చార్జ్ దామోదర్ నాయుడు, మార్కెటింగ్ ఇన్‌చార్జ్ కిషోర్ తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం సీతారావమ్మ, కంపెనీ మార్కెటింగ్ ఆఫీసర్ మహేష్ కుమార్, పేరుసోముల మేనేజర్ నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షల కిట్ పంపిణీ



కిట్‌లు అందుకున్న పదో తరగతి విద్యార్థులు

ప్యాపిలి: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులకు ఏకలవ్య సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం పరీక్షల కిట్ పంపిణీ చేశారు. పరీక్షల ప్యాడ్, హాల్‌టికెట్ కవర్, పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, షార్పనర్, స్కేలుతో కూడిన కిట్‌ను ఏపీవైఎస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సీహెచ్ మనోరమ అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి నాయకులు శేషాద్రి, శేఖర్, గోపాల్, బొట్టు శ్రీను, సీహెచ్ బాలకృష్ణ, మహేంద్ర పాల్గొన్నారు.

రసీదు తప్పనిసరి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ

డోన్ టౌన్: కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు వ్యాపారుల నుంచి రసీదు పొందాలని ఆర్డీఓ నరసింహులు అన్నారు. శనివారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజు ఆయన్ను కలిసి సత్కరించారు. ఆయన చేతుల మీదుగా అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వైద్యుడి మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

బేతంచెర్ల: పట్టణంలో తహసీల్‌పేట కాలనీకి చెందిన డాక్టర్ నాగరాజు (70) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ, గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్లు ముర్తుజా వలి, బాబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, మండల, పట్టణ కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్ నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

యువతి అదృశ్యం

అవుకు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైంది. ఎస్‌ఐ రాజారెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చిల్లు శేఖర్ కుమార్తె చిల్లు వినిత గురువారం రాత్రి బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కుమార్తె ఎంత సేపటికీ తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితురాల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు శనివారం తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

విజయీభవ

పదో తరగతి పాసైతే విద్యార్థి జీవితంలో తొలి మెట్టు ఎక్కినట్లే. ఆ తర్వాత ప్రతి ఏడాది పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఏ ఉద్యోగానికైనా టెన్త్ ఉత్తీర్ణతే ప్రమాణికం. తొలి అర్హతగా పరిగణిస్తారు. మొదటిసారి పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థుల్లో భయం సహజం. ఆందోళన వీడి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కొన్ని రోజులు ఒత్తిడికి దూరంగా ఉండి ప్రణాళికాబద్ధంగా, ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారు.

- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు
- నియోజకవర్గంలో పరీక్ష రాయనున్న 3882 మంది విద్యార్థులు
- ఒత్తిడిని అధిగమిస్తే మంచి ఫలితాలు
- నేర్చుకున్న విషయాలను రివిజన్ చేసుకోవడం ముఖ్యం



స్టడీ తరగతుల్లో పది విద్యార్థులు

డోన్ రూరల్: పరీక్షల సమయం ఆసన్నమైంది. ఈ నెల 17వ తేదీ(రేపటి) నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలంటే నేర్చుకున్న విషయాలను స్పష్టంగా, పూర్తిగా తెలియజేయడానికి ఒక అవకాశం. మీ స్థాయిని కొలిచే కొలబద్ద. ఏడాది పాటు చదువుకున్న విషయాలను రెండు గంటల పరీక్షలో నిరూపించుకోవాల్సి ఉంటుంది. మంచి మార్కులు సాధించాలన్నా.. విజేతలుగా నిలవాలన్నా ప్రణాళిక ఎంతో ముఖ్యం. ముందుగా విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి.. స్వేచ్ఛగా ఆలోచించి రాస్తే విజయం సులువవుతుంది. చాలా మంది విద్యార్థులు కొన్ని ముఖ్యమైన ప్రశ్నల పట్టికను తయారు చేసుకుని వాటిని మాత్రమే చదువుతూ ఉంటారు. కానీ ఒకసారి ఊహించని ప్రశ్నలు పరీక్షల్లో ఎదురవుతాయి. అప్పుడే మీ పరిస్థితి తారుమారవుతుంది. ఉన్న కొద్దిపాటి సమయాన్ని సద్వినియోగం చేసుకుని అన్ని ప్రశ్నలకు జవాబులను నేర్చుకోవడం ఉత్తమం. నేర్చుకున్న విషయాలను రివిజన్ చేసుకోవడం కూడా ఎంతో ముఖ్యం. ఎప్పుడైతే మీకు అన్ని సబ్జెక్టులపై పూర్తి అవగాహన పెంచుకుంటారో విశ్వాసం దానంతటకదే మీదరి చేరుతుంది.

డోన్ నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు

మండలం	కేంద్రాలు	విద్యార్థులు
డోన్	08	1690
ప్యాపిలి	05	752
బేతంచెర్ల	06	1440
మొత్తం	19	3882

ప్రభుత్వ పాఠశాల్లో వంద రోజుల ప్రణాళిక

ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 8.15 నుంచి 9.15 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు రోజుకో సబ్జెక్టు చొప్పున వారానికి 7 సబ్జెక్టుల రివిజన్ చేయించారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి



పదిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. అందుకు అనుగుణంగా ప్రతి రోజు స్టడీ అవర్స్ నిర్వహించాం. ప్రణాళికాబద్ధంగా చదివించాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. విద్యార్థులు ఒత్తిడి వీడి ధైర్యంగా పరీక్షలు రాయాలి. ఉన్న కొద్దిపాటి సమయాన్ని వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.

–నారాయణ, ఉపాధ్యాయుడు, డోన్

సమయం వృథా చేసుకోవద్దు



కష్టపడి చదవాలని రాత్రిళ్లు ఎక్కువగా మేలుకొని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు. సినిమాలు, టీవీలు, ఇతరత్రా వినోద కార్యక్రమాలకు పరీక్షలు ముగిసేంత వరకు దూరంగా ఉండాలి. తగినంత నిద్ర, వ్యాయామం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రణాళిక బద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ఆత్మ విశ్వాసంతో పరీక్షలకు హాజరైతే విజయం సొంతమవుతుంది.

–సుధాకర్, ఉపాధ్యాయుడు

ఒత్తిడికి దూరంగా ఉండాలి



ప్రతి పరీక్షకు మధ్య ఒక రోజు సమయం ఉండడం వల్ల ఒత్తిడిని తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థులు ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నేర్చుకున్న విషయాలను రివిజన్ చేసుకోవడం ముఖ్యం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి. విద్యార్థులు ఇతరులతో పోల్చుకుని నిరుత్సాహ పడకూడదు. విజయం సాధిస్తున్నామనే ఆత్మ విశ్వాసంతో ఉండాలి.

–ప్రభాకర్, ఎంఈఓ, డోన్

సమయం లేదు మిత్రమా

పదో తరగతి విద్యార్థులకు ఈ రెండు వారాలు ఎంతో కీలకం. ఒక్క నిమిషం నిర్లక్ష్యం చేసినా ఏడాది శ్రమ, కష్టం వృథా అయినట్లే. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో మిగిలిన కొద్దిపాటి సమయాన్ని సంపూర్ణంగా.. సమర్థవంతంగా వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పది విద్యార్థులకు చైతన్యం, అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఒత్తిడి, భయం వీడితేనే చదివిన విషయాలు గుర్తుకొస్తాయనే విషయాలను మర్చిపోకూడదు. తద్వారా మంచి ఫలితాలు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల: వేసవికాలం కావడంతో దొంగతనాలు ఎక్కువగా జరిగే అస్కారం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతు నాయక్ సూచించారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎండాకాలంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఎక్కువగా జరుగుతాయన్నారు. పోలీస్ సర్కిల్‌లోని కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఇళ్లకు తాళం వేసి శుభకార్యాలకు వెళ్లే వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇస్తే అలాంటి ఇళ్లపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. రాత్రి వేళల్లో ఇళ్లకు తాళం వేసి మిద్దెలపై పడుకునే వ్యక్తులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పగటి వేళల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కన్పిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో పోలీసు గస్తీ ముమ్మరంగా కొనసాగుతోందన్నారు.

పొట్టేళ్ల బండి.. భలేగుందండి..!



బేతంచెర్ల: మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన సువార్తమ్మ, మద్దయ్య పొట్టేల బండితో డప్పువాయిద్యాల నడుమ ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ బండిని భక్తులు ఆసక్తిగా తిలకించారు. కాగా స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నాయకుల పరామర్శ



లోకేశ్వరరెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న కాటసాని రామిరెడ్డి



జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్లకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత సోముల లోకేశ్వరరెడ్డిని ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్‌తోపాటు మాజీ ఎమ్మెల్యేలు శనివారం పరామర్శించారు. ఈ నెల 12వ తేదీ రాత్రి గ్రామానికి చెందిన టీడీపీ గూండాల చేతిలో తీవ్రంగా గాయపడి నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తలకు బలమైన గాయాలై కోమాలో ఉండడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. కోమా నుంచి తేరుకున్నట్లు సమాచారం అందడంతో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి లోకేశ్వరరెడ్డిని పరామర్శించారు. అనంతరం డాక్టర్లను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

అందరి సహకారంతోనే స్వచ్ఛాంధ్ర సాధ్యం

బనగానపల్లె రూరల్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లెలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణం నుంచి పెట్రోల్ బంక్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం చెత్త తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బనగానపల్లెలో ప్లాస్టిక్ నిర్మూలనకు వ్యాపారులు సహకరించాలని కోరారు.

భాగస్వాములు కావాలి

కోవెలకుంట్ల: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని సౌదరదిన్నెలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే కోవెలకుంట్లలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉద్యోగులు శ్రమదానం చేశారు. ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐ రంజిత్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

డోన్ టౌన్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అలాగే అటవీ కార్యాలయ ఆవరణలో డీఆర్‌ఓ రవీంద్రనాయక్, ఫారెస్టు రేంజర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ మహమ్మద్ హనీఫ్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు.



చెత్తతొలగింపు కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలిని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ హరినాథ్ రెడ్డి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వాతావరణ కాలుష్యానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ అని తెలిపారు. హోటళ్లు, టీస్టాల్‌లు ప్లాస్టిక్ కప్పులు, క్యారీ బ్యాగ్‌లు వాడకూడదన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

బేతంచెర్ల: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య జీవనం సాధ్యపడుతుందని డోన్ డిప్యూటీ డీఈఓ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. పట్టణంలోని ఎంపీయూపీ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ఎంఈఓ సోమశేఖర్‌తో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, తహసీల్దార్, ఎంపీడీఓ పట్టణ ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు.

ఆలయ పరిశుభ్రతకు సహకరించండి

ఆధ్యాత్మిక నిలయాలైన ఆలయాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మద్దిలేటి నరసింహస్వామి ఉపకమిషనర్, ఈఓ రామాంజనేయులు కోరారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కాగా శనివారం ఆలయానికి రూ.4,68,916 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

18న సామాజిక తనిఖీ బహిరంగ సభ

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈనెల 18న ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి శనివారం తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు, పంచాయతీ రాజ్, సర్వశిక్షా అభియాన్, పశుసంవర్ధక శాఖ కింద చేపట్టిన పనులపై పది రోజుల పాటు సిబ్బంది తనిఖీలు నిర్వహించి గ్రామ సభలు ఏర్పాటు చేశారన్నారు. గ్రామ సభలు ముగియడంతో 18న బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే

బనగానపల్లె: మండలంలోని పసుపల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చాకలి యల్ల కృష్ణుడు కుమారుడు మహేష్–మంజుల వివాహానికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ బనగానపల్లె, అవుకు మండల కన్వీనర్లు జనార్దన్‌రెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ మోహన్‌బాబు, నాయకులు రమేష్, మహేశ్వరరెడ్డి, జయ రాముడు, రామస్వామి పుల్లయ్య ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో పేకాట ఆడుతున్న 22 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.5,50,410 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మంజునాథ్‌రెడ్డి నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం బనగానపల్లె సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గ్రామంలోని తొగటవీరక్షత్రియ సత్రం సమీపంలో ఉన్న చెట్ల కింద జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, బనగానపల్లె, సంజామల గ్రామాలకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 22 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దొంగతనం కేసు నమోదు

ప్యాపిలి: పట్టణంలోని ఓ ఇంట్లో శుక్రవారం 9.5తులాల బంగారు నగలు, రూ. 2.5లక్షల నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. పెట్రోల్ బంకు వద్ద నివాసం ఉంటున్న గోపవరం ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి నంద్యాలకు వెళ్లగా చోరీ జరిగినట్లు బాధితుడు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు



బేతంచెర్లలో విక్టరీ చూపుతున్న విద్యార్థులు

బనగానపల్లె రూరల్: పట్టణంలో ఇంటర్మీడియెట్ సెకండ్ ఇయర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు బైపీసీ విద్యార్థులు కెమిస్ట్రీ పేపర్–2, ఆర్ట్స్ విద్యార్థులు కామర్స్, సోషియాలజీ పేపర్–2 పరీక్షలు రాశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మొత్తం 166 మంది విద్యార్థులకు గాను 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎస్వీ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రంలో 147 మందికి గాను 11 మంది, కేజీఆర్ జూనియర్ కళాశాలలో 181 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ ఆఫీసర్లు ఆనందరావు, తిరుపతయ్య, విశ్వనాథ్ తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లుగా ఓబయ్య, కిశోర్, నాగేశ్వరెడ్డి వ్యవహరించారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందంతో తమ స్నేహితులకు వీడ్కోలు పలికి ఇళ్లకు వెళ్లారు.

ప్యాపిలిలో ఇద్దరు గైర్హాజరు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ముగిశాయి. చివరి రోజు కెమిస్ట్రీ పరీక్షకు 100 మందికి గాను 98 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామకృష్ణయ్య, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ చంద్రకాంత్ తెలిపారు.

బేతంచెర్లలో 30 మంది గైర్హాజరు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చివరి పరీక్షకు 350 మంది విద్యార్థులకు గాను 30 మంది గైర్హాజరైనట్లు పరీక్షల కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మరియదాస్, డిపార్ట్‌మెంటల్ అధికారి దిలీప్ కుమార్ తెలిపారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా ఈనెల 18వ తేదీతో ఒకేషనల్ పరీక్షలు ముగియనున్నాయి.

- డోన్ టౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. విద్యార్థులు స్నేహితులను పలకరిస్తూ వేసవి సెలవులు ఆస్వాదించడానికి ఉత్సాహంగా ఇళ్లకు వెళ్లారు. కాగా నంద్యాల జిల్లాలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల మూల్యాంకనం మార్చి 7వ తేదీ నుంచి ప్రారంభమైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల ప్రత్యేకాధికారి, మైనింగ్ శాఖ జీఎం వేణుగోపాల్ అన్నారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండడంతో శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి, ఎంఈఓ అబ్దుల్ కలాం, ఎగ్జామ్ చీఫ్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో కలిసి పరిశీలించారు. తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన బల్లలు, లైటింగ్, మంచినీరు తదితర సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని తప్పక అందుబాటులో ఉంచాలని సూచించారు. మండలంలో పది ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలల నుంచి 560 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చెప్పారు. నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు హెచ్‌ఎంలు హాల్ టికెట్లు అందజేశారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవ్వాలని విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు.



అధికారులతో సమీక్షిస్తున్న స్పెషల్ ఆఫీసర్ వేణుగోపాల్

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్యాపిలి: మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ వెంకటేష్ నాయక్ తెలిపారు. శనివారం ఆయన పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలలో 190 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 197 మంది, పోతుదొడ్డి ఉన్నత పాఠశాలలో 68 మంది, రాచర్ల ఉన్నత పాఠశాలలో 86 మంది జలదుర్గం ఉన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

గాలికుంటు టీకాలతో పశువులకు రక్ష

అవుకు: గాలికుంటు టీకాలతో పశువులకు రక్షణ లభిస్తుందని.. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యురాలు భారతీదేవి సూచించారు. శనివారం మండల పరిధిలోని రామాపురం గ్రామంలో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. పశువులకు గాలికుంటు వ్యాధి సోకడం వల్ల పాల ఉత్పత్తి తగ్గిపోతుందని తెలిపారు. తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు.



గేదెకు టీకా వేస్తున్న పశువైద్యురాలు

‘ఉపాధి’లో వెలుగు చూసిన అక్రమాలు

- క్షేత్రస్థాయిలో కనిపించని మొక్కలు
- నిధుల రికవరీకి ఆదేశం
- సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అక్రమాలు సామాజిక తనిఖీలో వెలుగు చూశాయి. స్థానిక స్త్రీశక్తిభవన్ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. కోవెలకుంట్ల మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 2023 ఏప్రిల్ నెల నుంచి 2024 మార్చి నెలాఖరు వరకు ఉపాధిహామీ పథకం, పంచాయతీరాజ్, హౌసింగ్ శాఖల కింద రూ. 6.55 కోట్లతో చేపట్టిన పనులపై విచారణ జరిపారు. ఉపాధి పథక ప్రొసీడింగ్ ఆఫీసర్ బాలాంజనేయులు, డీవీసీ సీబారాణి, ఏపీడీ సాంబశివరావు ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలో పలు విషయాలను డీఆర్‌పీలు వెల్లడించారు. మండలంలోని రేవనూరులో రైతు పొలంలో 60 కొబ్బరి మొక్కలు నాటగా క్షేత్రస్థాయిలో మొక్కలు లేవని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొందరు కూలీలకు మస్టర్లలో సంతకాలు, వేలిముద్రలు లేకుండానే వేతనాలు చెల్లించారన్నారు. వలంటీర్లు ఉపాధి పనులు చేశారని సామాజిక తనిఖీలో వెల్లడించగా వేతనాల కింద వలంటీర్లకు చెల్లించిన రూ. 4,400 మొత్తాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా రికవరీ చేయాలని ప్రొసీడింగ్ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. గుళ్లదూర్తి గ్రామంలో రైతు పొలంలో 60 మొక్కలు నాటగా నీరందక మొక్కలన్నీ చనిపోయినట్లు సభ దృష్టికి తెచ్చారు. మొక్కలు నాటిన సమయంలో తీసిన ఫొటోలను చూపించడంతో సమస్య సద్దు మణిగింది. ఆయా గ్రామాల్లో పూర్తి వివరాలతో జాబ్ కార్డులు నింపలేదని, పనులు చేసిన ప్రదేశంలో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయలేదని డీఆర్‌పీలు అధికారుల దృష్టికి తెచ్చారు. కంపల్లె గ్రామంలో రూ. 58 వేల ఉపాధి నిధులు దుర్వినియోగం అయ్యాయని తేలడంతో దీనిపై విచారణ జరపాలని ఏపీడీ సాంబశివరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి రూ. 40,455 నగదు రికవరీ చేయాలని ఏపీఓ శ్రీవిద్యను ఆదేశించారు. అలాగే ఆయా గ్రామాల పరిధిలో రూ. 34,244 విలువ చేసే మొక్కలు చనిపోయాయని రైతులతో మాట్లాడి తిరిగి మొక్కలు నాటించాలని సూచించారు. ఎంపీడీఓ వరప్రసాదరావు, పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఉపాధి పథక టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు